## క్లుప్తంగా

### గుండాలపేటలో సీసీ కెమెరాలు ఏర్పాటు



సీసీ కెమెరాల ఏర్పాటును పరిశీలిస్తున్న ఎస్ఐ

**డెంకాడ:** మండలంలోని గుండాలపేట గ్రామంలో నాలుగు సీసీ కెమెరాల ఏర్పాటును ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు పరిశీలించారు. పలు ప్రధాన రహదారుల్లోను, గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశామన్నారు. నేరాల పరిశోధనలో వీటి పుటేజులు చాలా కీలకంగా ఉపయోగపడతాయని వివరించారు. స్థానికంగా ఉన్న పలువురు పెద్దల సహకారంతో వీటిని ఏర్పాటు చేస్తున్నట్టు తెలియజేశారు.

### నేలకూలిన చెట్లు



పిట్టాడ వద్ద రోడ్డుపై కూలిన తాటిచెట్టు

**మెంటాడ:** మండలంలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. గాలుల ధాటికి ఆంధ్ర వెళ్లే దారిలోని కొన్ని తాటిచెట్లు నేలకూలాయి. సరిగ్గా రెండేళ్ల క్రితం ఇదే దారిలో రోడ్డు పక్కన ఉన్న తాటిచెట్టు కూలి ఇద్దరు కూలీలు మృత్యువాతపడ్డారు. ప్రస్తుతం కూలిన చెట్టు కూడా ఓ పెళ్లి వ్యాన్‌పై పడాల్సింది కానీ అదృష్టవశాత్తు ప్రమాదం తప్పింది. ఈ నేపథ్యంలో ఈ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న చెట్లు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

### ఐఎస్ఐ మార్క్ వస్తువులే వినియోగించాలి



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

**రామభద్రపురం:** వంట గదిలో అదనపు సిలెండర్లు, మండే వస్తువులు ఉంచరాదని, ఐఎస్ఐ మార్క్ కలిగిన వస్తువులను మాత్రమే వినియోగించాలని బాడంగి అగ్నిమాపక శాఖాధికారి రామసూర్యారావు తెలిపారు. మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ వద్ద అగ్నిప్రమాదాల నివారణకు సంబంధించి, మాక్‌డ్రిల్ శుక్రవారం నిర్వహించారు. మంటలు చెలరేగితే సిబ్బంది తమను తాము ఎలా రక్షించుకోవాలో, ప్రమాద తీవ్రతను ఎలా తగ్గించుకోవాలోనన్న అంశాలను ప్రత్యక్షంగా చేసి చూపించారు.

### పంటలు బాగా పండాలని పూజలు



దాడితల్లికి పూజలు చేస్తున్న అర్చకులు

**బొబ్బిలి:** పంటలు బాగా పండాలని స్థానిక పట్టణ పరిధిలోని గొల్లపల్లి బైపాస్ రోడ్డులో ఉన్న దాడితల్లికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు పిండిప్రోలు మణికుమార్ శర్మ ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చన చేసి, ప్రజలను వ్యాధుల నుంచి దూరంగా ఉంచాలని, అలాగే ప్రతి రైతు వేసిన పంట అధిక దిగుబడులను ఇచ్చేలా ఆశీర్వదించాలని అమ్మవారిని వేడుకున్నారు. మే నెలలో జరిగే అమ్మవారి సిరిమానోత్సవం రోజున పూజలో వినియోగించిన గాజులను భక్తులకు అందజేస్తామని అర్చకులు తెలిపారు.

### వస్త్రదానం



దుస్తులు పంపిణీ చేస్తున్న కృష్ణదాసు మాస్టారు

**బొబ్బిలి:** స్థానిక పట్టణంలో రైల్వే లైను పనుల నిమిత్తం జార్ఖండ్ తదితర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కూలీల పిల్లలకు వనమిత్ర అధ్యక్షుడు కె.కృష్ణదాసు మాస్టారు శుక్రవారం వస్త్రదానం చేశారు. ఆయన తన సొంత డబ్బులతో పిల్లలకు సరిపడ దుస్తులు, పౌష్టికాహారం అందజేశారు. ఈ మేరకు పిల్లల తల్లిదండ్రులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

---

- ఈ వ్యర్థాలతో అనర్థాలు ఎన్నో...?
- నేడు స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్రలో భాగంగా నిరుపయోగ వస్తువుల సేకరణ
- నగరంలోని కోట జంక్షన్, కార్పొరేషన్ జంక్షన్‌లలో ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు
- కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరంలో అవగాహన ర్యాలీ

# ఉంచుకుంటే.. పెను ముప్పే..!



పేరుకు పోయిన ఈ వేస్ట్

**విజయనగరం:** ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పర్యావరణానికి ముప్పుగా మారుతున్నాయి. ప్రతి ఇంట్లో ఇతర వ్యర్థాల కన్నా ఎలక్ట్రానిక్ వ్యర్థాలే అధికంగా పేరుకుపోతున్నాయి. అందులో ఎక్కువగా కంప్యూటర్లు, సెల్‌ఫోన్‌లు ఉంటున్నాయి. ఆ పరికరాల్లో వినియోగించే చిప్‌లు, సెమీ కండక్టర్లు పర్యావరణానికి హాని చేస్తాయని నిపుణులు సూచిస్తున్నారు. వీటిని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని పేర్కొంటున్నారు.

**పునర్వినియోగంతోనే మేలు**

ఐక్యరాజ్య సమితి లెక్కల ప్రకారం 2019లో 50 మిలియన్ టన్నులకు పైగా ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పోగయ్యాయి. విజయనగరం కార్పొరేషన్ పరిధిలో 2011 జనాభా లెక్కల ప్రకారం 3 లక్షలకు పైగా జనాభా ఉంది. 70వేలకు పైగా అసెస్మెంట్‌లు ఉన్నట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. ఈ కాలంలో ఒక్కో ఇంట్లో సరాసరి మూడేసి సెల్‌ఫోన్‌లు వ్యర్థాలుగా పేరుకుపోయాయి. పాత కంప్యూటర్ డెస్క్‌టాప్‌ల స్థానంలో కొత్తవి రాగానే వాటిని కట్టి అటకెక్కిస్తున్నారు. ఇలా వేల కుటుంబాల్లో రెండు కంప్యూటర్లు, రెండు సీపీయూలు పేరుకుపోయాయి. కీ బోర్డులు, మౌస్లు వంటి పరికరాలు నిరుపయోగంగా మారి ఇళ్లలోని ఫర్నిచర్ల మధ్య ఉంటున్నాయి. పునర్వినియోగం చేస్తేనే పర్యావరణ హితానికి ఆస్కారం.

**భూతాపం పెరుగుదలలో పాత్ర**

ఇళ్లలో పేరుకుపోయే తడి, పొడి చెత్తతో పోలిస్తే ఎలక్ట్రానిక్ వ్యర్థాలు మరింతగా హాని చేస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎలక్ట్రానిక్ వస్తువుల్లో ప్లాటినమ్, బంగారం, వెండి వంటి విలువైన లోహాలతో పాటు సీసం, తగరం, పాదరసం, ఆర్సెనిక్, కాడ్మియం, లిథియం, బేరియం వంటి భార లోహాలు కూడా ఉంటాయి. భార లోహాలు నేలకి చేరుకుంటే భూసారం క్షీణిస్తుంది. జలాశయాల్లోకి చేరితే తాగునీటి కాలుష్యం ఏర్పడుతుంది. ఎలక్ట్రానిక్ పరికరాల తయారీలో వాడే పదార్థాలు చెత్త కుప్పలోకి చేరినప్పుడు అనుకోకుండా మంట తగిలి వ్యర్థాలు దహనమవుతున్నాయి. దీంతో వాయు కాలుష్యం ఏర్పడుతోంది. తద్వారా ఆ వాయువులు పీల్చినప్పుడు అనారోగ్యం బారిన పడే అవకాశాలున్నాయి. వీటి ద్వారా తలనొప్పి, శ్వాసకోశ వ్యాధులు, ఛాతినొప్పి, మానసిక ఒత్తిడి, దీర్ఘకాలిక రుగ్మతలకు లోనయ్యే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

**ఈ - వ్యర్థాల సేకరణకు చర్యలు**

ఎలక్ట్రానిక్ వ్యర్థాల తొలగింపుపై అధికార యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది. ఇబ్బడిముబ్బడిగా పేరుకుపోయిన వీటి వల్ల పర్యావరణపరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇవి భారీగా పేరుకుపోతున్నాయి. స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 19న శనివారం ఈ -వ్యర్థాల తొలగింపునకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ - వ్యర్థాల్లో భాగంగా బ్లాక్ అండ్ వైట్ టీవీలు, పని చేయని డెస్క్ టాప్ కంప్యూటర్లు, కీబోర్డులు, మౌస్లు, మానిటర్లు, మూగబోయిన ఫోన్లు, ఛార్జర్లు, పాతకాలం ఏసీలు, రేడియోలు తదితర ఎలక్ట్రానిక్స్ వస్తువులను సచివాలయ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులకు అందజేసేలా కార్యాచరణ రూపొందించారు. ఇందుకోసం కార్పొరేషన్ కార్యాలయం, కోట జంక్షన్ ప్రాంగణాల్లో ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేయగా... సచివాలయాల్లో , పారిశుధ్య కార్మికులు ఈ - వ్యర్థాలను సేకరించనున్నారు. అవసరమైన వాటిని ఉత్పాదక, పునర్వినియోగం, పునరుత్పాదక రంగాలకు తరలిస్తారు.

**నేడు నగరంలో ప్రత్యేక కార్యక్రమాలు :**

స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి నగరంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఉదయం 10 గంటలకు పైడితల్లి అమ్మవారి దేవస్థానం నుంచి కోట వరకు స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, స్కూల్ మరియు కళాశాల విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈసారి ఈ వేస్ట్ సేకరణే ప్రధాన ధ్యేయంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ర్యాలీలో పాల్గొనేందుకు వచ్చిన ప్రతి ఒక్కరూ ఖాళీ చేతులతో రాకుండా నిరుపయోగమైన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వస్తువులను తప్పనిసరిగా తీసుకురావాలని చెప్పారు. లేని పక్షంలో తమ సచివాలయ పరిధిలో ఉన్న శానిటరీ కార్యదర్శులకు అందజేయవచ్చునని చెప్పారు. విజయనగరం కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా, కోట జంక్షన్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ వేస్ట్ సేకరణా కేంద్రాలలో నిరుపయోగమైన ఈ వేస్ట్ వస్తువులను అందజేయవచ్చునని తెలిపారు.

---

## 21న కంచి విశ్వవిద్యాలయ ప్రవేశాలు

- శంకర మఠం అధ్యక్షుడు డాక్టర్ రవిరాజు



డాక్టర్ టి.రవిరాజు

**విజయనగరం:** కంచి విశ్వవిద్యాలయ ప్రవేశాలు ఈ నెల 21న విశాఖపట్నం శంకర మఠంలో నిర్వహించనున్నట్టు శ్రీకంచి కామకోటి శంకర మఠం అధ్యక్షుడు డాక్టర్ టి.రవిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం ద్వారకానగర్ శంకర మఠంలో 21న, 22న విజయనగరంలోని సన్ స్కూల్ ఆవరణలో, అదే రోజు శ్రీకాకుళంలోని గాయత్రి స్కూల్, గీతాంజలి స్కూల్ ఆవరణలోనూ ప్రవేశ ప్రక్రియ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియలో పాల్గొనేందుకు యూనివర్సిటీ వీసీ ఆచార్య గుళ్లపల్లి శ్రీనివాస్, వైస్ చాన్సలర్ కె.వెంకటరమణ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



క్రీస్తు సందేశాన్ని వివరిస్తున్న దైవ సేవకులు

**నెల్లిమర్ల రూరల్:** గుడ్ ఫ్రైడేను క్రైస్తవ సోదరులు భక్తిశ్రద్ధలతో శుక్రవారం జరిపారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శాంతియుత సమాజం కోసం రక్తాన్ని చిందించిన యేసుక్రీస్తు జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పలువురు సూచించారు. పెద్ద సంఖ్యలో క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**నెల్లిమర్ల రూరల్:** మండలంలోని కొండవెలగాడ, సతివాడ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ డీఈఈ పి.త్రినాథరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మలు తొలగించడంతో పాటు సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు సరఫరా నిలుపుదల చేస్తున్నామని పేర్కొన్నారు. కొండవెలగాడ, చంద్రంపేట, టెక్కలి, ఎల్ఎన్ పురం, తుమ్మలపేట, చిన బూరాడపేట, పెద్ద బూరాడపేట, పారసాం, గెద్దపేట గ్రామాలతో పాటు గుర్ల మండలంలోని చింతలపేట, భూపాళపురం, ఆనందపురం, తాళ్లపూడిపేట, గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. సతివాడ సబ్‌స్టేషన్ పరిధిలో మధుపాడ, పినతరిమి, పెద తరిమి, బొప్పడాం, వల్లూరు, బుచ్చన్నపేట, బొడ్డపేట, ఒమ్మి, మల్యాడ, వెంకన్నపాలెం గ్రామాలకు సాయంత్రం 4 గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నామని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

---

- అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు
- గంట్యాడ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 166 కేంద్రాలు
- వీటిలో 35 కేంద్రాలూ పరాయిపంచనే..
- కనీస వసతుల్లేక చిన్నారుల అవస్థలు

# అద్దె భవనాల్లోనే.. ఏళ్లతరబడి!



కొర్లాంలో అద్దె భవనంలోని ఇరుకైన గదిలో పిల్లలకు చదువు చెబుతున్న అంగన్‌వాడీ కార్యకర్త

**గంట్యాడ:** ఏళ్ల తరబడి అద్దె భవనాల్లోనే అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. దీంతో అక్కడ ఉండే అరకొర సదుపాయాలతోనే సర్దుకుపోవాల్సిన పరిస్థితి. అటు అంగన్‌వాడీ సిబ్బంది, ఇటు పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే సొంత భవనాలు ఉండి ఉంటే అందులోనే పక్కా వసతులు ఉంటాయని, అప్పుడే అనుకున్న లక్ష్యం నెరవేరేందుకు వీలుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. గంట్యాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో ప్రభుత్వ శిథిల భవనాలు, అద్దె భవనాల్లోనే వాటిని నిర్వహిస్తున్నారు. వాటిల్లో కనీసం మరుగుదొడ్ల సదుపాయం కూడా లేదు. మరికొన్ని భవనాల్లో అయితే విద్యుత్ సౌకర్యం లేదు. ఇరుకైన గదులు, గాలి, వెలుతురు రానిచోట పిల్లలు ఉక్కపోతతో అవస్థలు పడుతున్నారు. ఇదంతా చూస్తున్న చిన్నారుల తల్లిదండ్రులు ఇంకెన్నాళ్లు పరాయిపంచన కేంద్రాలు నిర్వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. త్వరితగతిన కొత్త భవనాలు నిర్మించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

**మొత్తం 166 కేంద్రాలు..**

గంట్యాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో బొండపల్లి, గంట్యాడ మండలాలు ఉండగా, వాటిల్లో మొత్తం 166 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. గంట్యాడ మండలంలో 96, బొండపల్లి మండలంలో 70 కేంద్రాలు ఉండగా వీటిలోని 35 కేంద్రాలు ఇంకా అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. కొన్ని దశాబ్దాలుగా ఇవి పరాయిపంచనే నడుస్తుండడంతో అద్దెభారం ఎక్కువవుతోందని, అవే అద్దెలతో సొంత భవనం నిర్మిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**నెలకు రూ.వేలల్లో అద్దె చెల్లింపు..**

సొంత భవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తుండం వల్ల నెలకు రూ.వేలల్లో అద్దె చెల్లించాల్సి వస్తోంది. గంట్యాడ ఐసీడీఎస్ పరిధిలో అద్దె భవనాల్లో ఉంటున్న మొత్తం 35 కేంద్రాలకు సంబంధించి, నెలకు రూ.45 వేల నుంచి రూ.50 వేలు వరకు చెల్లిస్తున్నారు. ఈ లెక్కన ఏడాదికి రూ.5.40 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు అద్దె చెల్లిస్తున్నారు. అదే ఏడాది అద్దె సొమ్ముతో సొంత భవనం నిర్మిస్తే ఈ అద్దె భారం ఉండదు కదా అని అంతా అంటున్నారు.

**కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి..**

గంట్యాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 15 అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మాణ దశలో ఉన్నాయి. వాటి నిర్మాణం పూర్తవ్వగానే అద్దె భవనాల్లోని కేంద్రాలను వాటిల్లోకి తరలిస్తాం. వీలైనంత వరకు సదుపాయాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నాం.

–డి.ఉమాభారతి, ఐసీడీఎస్ పీవో, గంట్యాడ

---

## పైడితల్లి చండీయాగం



కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు జన్మనక్షత్రమైన మూలా నక్షత్రం పురస్కరించుకుని శుక్రవారం స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో వేదపండితులు వెలువలపల్లి నరసింహమూర్తి శాస్త్రోక్తంగా చండీయాగం నిర్వహించారు. అమ్మవారి యాగ ప్రక్రియను భక్తులకు వివరించారు. ప్రసాదాలను, శేషవస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈఓ ప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

- విజయనగరం టౌన్

## కట్టమూరికి సాహితీ సార్వభౌమ బిరుదు ప్రదానం



కట్టమూరికి సాహితీ సార్వభౌమ బిరుదు ప్రదానం చేస్తున్న కౌముదీ పరిషత్ ప్రతినిధులు

- ఆద్యంతం ఆలోచింపజేసిన భువన విజయం నాటకం
- ఘనంగా కౌముదీ పరిషత్ 90వ వార్షికోత్సవం



భువన విజయం నాటక ప్రదర్శన

**విజయనగరం టౌన్:** శ్రీ సూర్యసదన ఆస్థాన పండితులు, అవధాని, కవి పండితులు, ధార్మిక ప్రవచకులు డాక్టర్ కట్టమూరి చంద్రశేఖరానికి కౌముదీ పరిషత్ 90వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సాహితీ సార్వభౌమ బిరుదును ప్రదానం చేశారు. రింగురోడ్డులోని కల్యాణ వేంకటేశ్వరస్వామి సన్నిధానంలో శుక్రవారం నిర్వహించిన వార్షికోత్సవంలో కవులు, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానుల జయ జయ ధ్వానాల మధ్య కట్టమూరి దంపతులకు ఘన సత్కారం చేశారు. కౌముదీ పరిషత్ అధ్యక్షుడు ధవళ సర్వేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వైయాకరణ విద్యా వాచస్పతి డాక్టర్ ఎ.గోపాలరావు పాల్గొని కట్టమూరి చేసిన సాహితీ సేవలను వివరించారు. సాహితీవేత్త డాక్టర్ జక్కు రామకృష్ణ సన్మాన పత్రం చదివి వినిపించారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీత మాట్లాడుతూ కౌముదీ పరిషత్ బిరుదుతో పాటూ ఘన సత్కారం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం 50 మంది కవులు, పండితులు, కళాకారులను ఉచితరీతిన సత్కరించారు. కార్యక్రమంలో పువ్వాడ శ్రీహరి, డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, డాక్టర్ పీటీజీవి.రంగాచార్యులు, చెరుకూరి శ్రీధర్, రేఖాన సుధాకర్, మనాప్రగడ సాహితీ తదితరులు పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న 'భువన విజయం'**

కౌముదీ పరిషత్ 90వ వార్షికోత్సవం పురస్కరించుకుని సంధ్యాకౌముది పేరిట శుక్రవారం రాత్రి కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన భువన విజయం నాటకం ఆద్యంతం కట్టిపడేసింది. పురస్కార గ్రహీత డాక్టర్ కట్టమూరి చంద్రశేఖరం రచన, దర్శకత్వం, శ్రీకృష్ణదేవరాయులుగా అబ్బురపరిచారు. తిమ్మరుసు మహామంత్రిగా సుధాకర్, అల్లసాని పెద్దనగా కోటమర్తి అమృతేశ్వరరావు, నందితిమ్మనగా డాక్టర్ జక్కు రామకృష్ణ, ధూర్జటిగా కాకరపర్తి మురళీప్రసాద్, అయ్యలరాజు రామభద్రుడుగా గుండపు శ్రీనివాసరావు, మాదయగారి మల్లన్నగా డాక్టర్ పీటీజీవి.రంగాచార్యులు, పింగళి సూరనగా చెరుకూరి శ్రీనివాసరావు, భట్టుమూర్తిగా కొట్టు బాబూరావు, తెనాలి రామకృష్ణునిగా పారాది శ్రీనివాసరావులు పాత్రోచితమైన ప్రదర్శన చేసి కరతాళధ్వనులందుకున్నారు. కార్తికేయ సంగీత సహకారమందించారు. సత్యనారాయణ ఆహార్యం, నాట్యం వడ్లమాని రమణకుమారి బృందం, శ్రీనివాస సేవా సంఘం సహకారమందించారు.

## శ్రీఅమ్మ సేవా సంఘం ఔదార్యం




ఏసీ అవుటర్ బాక్సులో చలివేంద్రం వద్ద దాహార్తి తీర్చుకుంటున్న పాదచారి

విజయనగరం జిల్లా కేంద్రం కంటోన్మెంట్ వద్ద శ్రీఅమ్మ సేవా సంఘం ఏసీ అవుటర్ డొక్కుల్లో చలివేంద్రం ఏర్పాటు చేసింది. మండు వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ ఏర్పాటు చేసింది. ఎండలు మండుతుండడంతో ఈ మార్గంలో వెళ్లే పాదచారులు చల్లని తాగునీటితో తమ దాహార్తిని తీర్చుకుంటున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం